క్లుప్తంగా

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న పుట్ట రవి మాదిగ

సిరిసిల్ల అర్బన్ : వృద్ధులు, వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని వికలాంగుల చేయూత హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ అన్నారు. గురువారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వృద్ధులు వికలాంగులకు ఇచ్చిన పెన్షన్ పెంపు హామీని రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వం అమలుచేయడం లేదన్నారు. ఈనెల 27న జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్‌లో నిర్వహించే సమావేశానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారన్నారు. సమావేశానికి జిల్లాలోని వికలాంగులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు శోభారాణి, పురుషోత్తం రావు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రభాకర్, ఖానాపురం లక్ష్మణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-2, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్-3, కామర్స్-2 సబ్జెక్టులకుగాను పీజీ సబ్జెక్టులలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు ఉన్నవారు అర్హులన్నారు. అర్హతగల అభ్యర్థులు ఈనెల 26లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈనెల 30న సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

సిరిసిల్లటౌన్: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం నుంచి కార్మికక్షేత్రంలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈవో మారుతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు



భార్గవిని అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్

వేములవాడ: పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన విద్యార్థిని బొప్పా భార్గవి 2024-2025 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 581 మార్కులు సాధించి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా పాఠశాలల డైరెక్టర్ శ్రీసన్నిధి వెంకట కృష్ణ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఎల్లారెడ్డిపేట: క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి సారియా అంజుమ్ అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువుతగ్గడం లాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. 110 మంది అనుమానితులను గుర్తించి నమూనాలను పరీక్షలకు పంపించామన్నారు. టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, హెచ్ఏ బాబు, హెచ్ఎస్ పద్మ, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గోదాం నిర్మించాలి

ముస్తాబాద్: కొండాపూర్‌లో గోదాం నిర్మించి రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు చిగురు వెంకన్న గురువారం విజ్ఞప్తి చేశారు. గతంలో పోతుగల్ సింగిల్‌విండో ద్వా రా కొండాపూర్‌లో గోదాంను అద్దెకు తీసుకుని, ఎరువులు అందించేవారన్నారు. ఇప్పుడు కొండాపూర్ రైతులు గూడెం గోదాంకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు కొండాపూర్‌లో గోదాంను నిర్మించి రైతుల సమస్యను పరిష్కరించాలన్నారు. పోతుగల్ సింగిల్‌విండో ద్వారానైన కొండాపూర్‌లో గోదాంనిర్మిస్తే రాంరెడ్డిపల్లె రై తులకు కూడా అందుబాటులో ఉంటుందన్నారు.

నేడు ఉపాధిహామీ సామాజిక తనిఖీ

ముస్తాబాద్: మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ మండలసభను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏపీవో ఆనంద్ మోహన్ తెలిపారు. 2024-25లో రూ.6 కోట్లతో చేపట్టిన పనులపై మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. అధికారులు, కూలీలు, హాజరుకావాలని కోరారు.

ప్రారంభానికే పరిమితం

- రూ.లక్షలాదితో మర్రిగడ్డ పల్లె దవాఖానా నిర్మాణం
- విద్యుత్ కనెక్షన్ లేక అలంకారప్రాయం
- అద్దె భవనంలో ఇబ్బంది పడుతున్న వైద్యసిబ్బంది



మర్రిగడ్డలో నిరుపయోగంగా పల్లె దవాఖానా

చందుర్తి: గ్రామీణప్రాంత ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం మండలంలోని మర్రిగడ్డలో రూ.20లక్షలతో పల్లె దవాఖానా నిర్మించింది. గత పాలకవర్గం ఆగమేఘాలమీద ప్రారంభించారు. కానీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అలంకార ప్రాయంగా మారింది. అప్పటిపాలకులు ప్రారంభించి పట్టించుకోకుండా చేతులుదులుపుకున్నారని స్థానికులువిమర్శిస్తున్నారు.

విద్యుత్ లైన్‌కు నిధులు చెల్లిస్తే..

మర్రిగడ్డ సబ్‌స్టేషన్ నుంచి పల్లె దవాఖానా వరకు 450 మీటర్ల పొడవు విద్యుత్ లైన్‌ను కొత్తగా వేయాల్సి ఉంది. ఈ లైన్‌కోసం సుమారు రూ.లక్ష 30వేలు ఖర్చవుతోందని గతేడాది సెస్ సిబ్బంది అంచనాలు వేసి స్థానిక ప్రజాప్రతినిధులకు అందజేశారు. పెద్ద మొత్తంలో నిధులు గ్రామపంచాయతీలో లేకపోవడంతో అప్పటి ఎమ్మెల్యేపై భారం వేశారు. విద్యుత్ సరఫరా లేకపోతే మందులు స్టోరేజీ చేయలేక, అందులో విధులు నిర్వర్తించలేక వైద్య సిబ్బంది పనులు పూర్తికాలేదంటూ దానికి తాళంవేశారు. విద్యుత్ లైన్ ఖర్చులు సెస్ సంస్థకు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా జరుగుతుందని వైద్య సిబ్బంది తెలుపుతున్నారు.

పల్లె వాకిట్లో వైద్యసేవలు..

గ్రామీణప్రాంతాల్లో సైతం మారిన జీవనశైలితో వ్యాధులు విజృంభిస్తున్నాయి. బీపీ,షుగర్ ఇతర వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రజలు కిడ్నీ, పక్షవాతం, గుండెజబ్బుల బారినపడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, సమస్య పెద్దగా ఉంటే ముందుగా పల్లె దవాఖాన నుంచి పీహెచ్‌సీ, లేదా జిల్లా ఆస్పత్రికి పంపిస్తారు.

అద్దె భవనంలోనే సేవలు

రూ.లక్షలు వెచ్చించి పల్లె దవాఖాన భవనాన్ని నిర్మించినా ప్రయోజనం లేకుండాపోయింది. అద్దె భవనానికి మాత్రం వైద్యశాఖ నెలకు రూ.1500ల చొప్పున చెల్లిస్తోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టిసారించి నిధులు మంజూరు చేసి పల్లె దవాఖానను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అద్దె భవనంలో ఇబ్బంది



మర్రిగడ్డ ఉప ఆరోగ్యకేంద్రాన్ని పల్లె దవాఖానాగా మార్చుతూ భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఏడాదిన్నర క్రితమే ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో అద్దె భవనంలో వైద్య సేవలు అందిస్తున్నాం. అద్దె భవనంలో అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నాం.

– రేణుక, ఉప ఆరోగ్య కేంద్రం, ఏఎన్ఎం

నిధులు సరిపోకపోవడంతోనే



పల్లె దవాఖానా భవనంలో విద్యుత్ పనులు పూర్తయ్యాయి. విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవడంతో సెస్ సంస్థకు డబ్బులు చెల్లించలేదు. విద్యుత్ స్తంభాలు వేసేందుకు అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబును నిధులు కేటాయించాలని కోరగా నిధులు సమకూర్చలేదు. విద్యుత్ సౌకర్యం కల్పిస్తే పనులు పూర్తయినట్లే.

– నేతికుంట జలపతి, మాజీ సర్పంచ్, మర్రిగడ్డ

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వేములవాడ రూరల్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

చందుర్తి: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులు వంగ తిరుపతి, తాటికొండ సంజీవ్ కుమార్, కట్కూరి ముఖేష్, గుర్రం కృష్ణారెడ్డి, కృష్ణచైతన్య, ఘడప రఘుపతిరావు, గుడిమల్ల సురేశ్, సుజాత, శ్రీలత, రజిత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల సాధనకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ అబుబాకర్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. టీపీటీఎఫ్ నాయకులు బొజ్జ కృష్ణ, పార్వతి తిరుపతి, చకినాల రామచంద్రం, శ్రీరామోజు శ్రీనివాస్, రజిని, రాణి, పీఆర్‌టీయూ టీజీఎం.హరికృష్ణ, పి.సత్యనారాయణ, వికృతి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పిసి) ఆధ్వర్యంలో తహసీల్దార్ ముక్తార్ పాషాకు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లు చేపట్టాలన్నారు. యూఎస్‌పీసీ సంఘాల నాయకులు తిరుపతి జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: విద్యా, ఉపాధ్యాయ రంగాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు.అనంతరం 30 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సుజాతకు అందజేశారు. జీవో నంబర్ 25ను సవరించాలని, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నార మండల పోరాట కమిటీ ప్రతినిధులు ప్రవీణ్, లక్ష్మణ్, సంపత్, విష్ణుప్రసాద్, షఫీ, రామచంద్రం, రాజు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన విప్



గాంధీభవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు గాంధీభవన్‌లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేసిన ఒకరోజు ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడినట్లు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట: రానున్న స్థానిక సంస్థల్లో సత్తాచాటాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కార్యకర్తలకు సూచించారు. గురువారం బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కోసం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సిద్ధం వేణు, నాయకులు కేవీఎస్ రెడ్డి, ఉడుతల వెంకటేశం, ప్యాక్స్ చైర్మన్ తిరుపతి రెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఒగ్గు నర్సయ్య, యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

‘కలెక్టర్, కేకేపై విమర్శలు సరికాదు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని పార్టీ జిల్లా నాయకులు లింగాల భూపతి, మునిగెల రాజు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.. కేటీఆర్ కనుసన్నల్లో కలెక్టర్, కేకేలపై కుట్ర జరుగుతోందని ఆరోపించారు. యూట్యూబ్ ఛానెల్స్‌తో కొందరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ నాయకులు ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మందాటి తిరుపతి యాదవ్, సత్యనారాయణ రెడ్డి, ఎడ్ల తిరుపతి, మోర లక్ష్మీరాజం, శ్రీనివాస్, ఎగుర్ల ప్రశాంత్, చెన్నమనేని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ ప్రారంభం



రుద్రంగి: రుద్రంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో వినియోగించే కూరగాయలు పాఠశాలలోనే పండించి విద్యార్థులకు అందించేందుకు ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను గురువారం అధికారులు ప్రారంభించారు. కిచెన్ గార్డెన్‌తో విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన తాజా కూరగాయలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఎంపీడీవో నటరాజ్, మండల విద్యాధికారి రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారిని ప్రియదర్శిని, మండల పంచాయతీ అధికారి రాజేశ్వర్ గౌడ్, గ్రామ పంచాయతీ సెక్రటరీ రాందాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

- వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్

వేములవాడ: హత్యాయత్నం కేసులో నిందితురాలికి మూడేళ్ల జైలుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ జాదవ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన కోనేటి రవి, రాజమణి దంపతుల కూతురు ప్రేమలత ప్రేమ వివాహం చేసుకుంది. ఇందుకు తిప్పాపూర్‌కు చెందిన బొర్రోజు జనార్దన్ కూతురు సహకరించిందనే అనుమానంతో వారి ఇంటికొచ్చిన రవి భార్య రాజమణి.. జనార్దన్ కూతురితో మాట్లాడుతానని నమ్మించి బిల్డింగ్‌పైకి తీసుకెళ్లి కిందికి తోసేసింది. ఆ యువతికి తీవ్రగాయాలు కావడంతో జనార్దన్ 2020, ఫిబ్రవరి 7న వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై మాలకొండ రాయుడు కేసు నమోదు చేయగా దర్యాప్తు అధికారి సీఐ వెంకటేశ్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్సై రవీంద్రనాయుడు, కానిస్టేబుల్ మధుసూదన్, కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ జాదవ్.. నిందితురాలికి మూడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించారు.

సంక్షిప్త వార్తలు

• స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

ఇల్లంతకుంట: మండల వనరుల కేంద్రంలో ప్రైమరీ స్కూల్ పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఎంఈవో చెప్యాల శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశంలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలుచేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు పావని, తిరుపతి, ప్రేమలత, ట్రైనర్ సందీప్ రెడ్డి,ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

• ఇసుక ట్రాక్టర్ బోల్తా..

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో గురువారం ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వెంకటాపూర్ నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని డ్రైవర్ ఇసుకను అన్‌లోడ్ చేశాడు. అనంతరం డ్రైవర్ వేగంతో ట్రాక్టర్‌ను నడపడంతో బోల్తాపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇసుక ట్రాక్టర్ల అతివేగంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండలప్రజలు కోరుతున్నారు.

• ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ ఓబీసీ నాయకులు

బోయినపల్లి: ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో ఈనెల 25న జరిగే ఓబీసీ నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు జిల్లా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో పలువురు ఓబీసీ నాయకులు గురువారం ఢిల్లీ తరలివెళ్లారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీలతో సమావేశం ఉంటుందని తెలిపారు. నాయకులు నాగుల వంశీ, శాలివాహన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

• పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల శివారులోని ఓ పౌల్ట్రీఫామ్‌లో పేకాటస్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి ఏడు సెల్‌ఫోన్లు, కారు, రెండు బైక్‌లు, రూ.15,280 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా బోనాలు



వేములవాడ అర్బన్ : బోనాలతో విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట/వేములవాడ అర్బన్ : ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం బోనాల పండుగ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు డప్పు చప్పుళ్ల, బోనాలతో గ్రామం పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామ దేవతలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి ఈ టెక్నో స్కూల్‌లో బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఆసరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్ నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు మినీ వాటర్ ట్యాంక్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : సాయికుమార్
పంచాయతీ కార్యదర్శి, 9182099814

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



వేములవాడ : రాజన్న ఆలయంలో కోడె మొక్కు చెల్లించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



సిరిసిల్ల టౌన్ : ఆస్ట్రేలియాలో కేటీఆర్ బర్త్‌డే వేడుకలు

సిరిసిల్ల టౌన్/సిరిసిల్లకల్చరల్/సిరిసిల్ల అర్బన్/వేములవాడ/వేములవాడ రూరల్/గంభీరావుపేట/బోయినపల్లి/ ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/తంగళ్లపల్లి/ఇల్లంతకుంట/రుద్రంగి/వీర్నపల్లి: జిల్లావ్యాప్తంగా మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబురాలు జరిపారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా పలు మండలాల్లో బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. కేటీఆర్ జన్మదిన వేడుకలను న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. న్యాయస్థాన ప్రాంగణంలో బార్ అసోసియేషన్ కార్యాలయం ముందు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. సీనియర్ న్యాయవాదులు నర్సింగరావు, రవీందర్ రావు, అనిల్‌కుమార్, సదానందం, ప్రసాద్‌గౌడ్, పూర్ణచందర్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సిడ్నీలో రాజేశ్ రాపోలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా సిడ్నీలో రవీందర్ చింతామణి ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు. బీఆర్ఎస్ ఆస్ట్రేలియా కోర్ కమిటీ నాయకులు రవీందర్ చింతామణి, పరశురాం, లివింగ్‌స్టన్, సాయి గుప్త, చిరాన్, మధుకర్, శ్రీనివాస్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు. రగుడు ఒకటో వార్డులో కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా బాలింతలకు మాజీ కౌన్సిలర్ పోచవేని సత్య కేసీఆర్ కిట్లు అందించారు. బీఆర్ఎస్ నాయకులు ఎల్లయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు. వేములవాడ రాజన్నకు ఆపార్టీ శ్రేణులు కోడె మొక్కు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చల్మెడ లక్ష్మీనర్సింహారావు క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ తిరుపతిరెడ్డి, రామతీర్థపు రాజు, క్రాంతికుమార్, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, నరాల శేఖర్, జోగిని శంకర్, సిరిగిరి చందు, తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల్లో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండలకేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పదిరలో నరేండ్ల స్వప్న మృతిచెందగా పిల్లలు సన్నిహిత్, శాశ్వతకు మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి పుస్తకాలు, దుస్తులు రూ. 5వేలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, నాయకులు పాల్గొన్నారు. గంభీరావుపేట మండలం గోరింటాలలో మాజీ జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్ఎస్ నాయకులు, మండలకేంద్రంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో సెస్ మండల డైరెక్టర్ నారాయణరావుతో పాటు బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. ముస్తాబాద్ శివకేశవుల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, పాల్గొన్నారు. బోయినపల్లితో పాటు సీలోజిపల్లి తదితర గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కేసీఆర్ కిట్లు అందజేశారు. అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, అనుముల భాస్కర్, గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాసరెడ్డి, అంజన్ రావు, కొంకటి శేఖర్, ఎండీ.అజ్జు, భీమనాథుని రమేశ్, నాగయ్య, తదితరులన్నారు. కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మాజీ ఎంపీపీ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. తంగళ్లపల్లి మండలకేంద్రంలో బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు కోడి అంతయ్య, జక్కుల నాగరాజు, బండి దేవదాస్, భాస్కర్ యాదవ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇల్లంతకుంటలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మండల మాజీ జెడ్పీటీసీ సిద్ధం వేణు, నాయకులు పాల్గొన్నారు. వేములవాడ మండలం బొల్లారంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. శ్రవణ్, లచ్చయ్య, రామచంద్రం, ప్రవీణ్, తిరుపతి, సంతోష్, శ్రీనివాస్, శేఖర్, అంజిబాబు, అనిల్, ప్రవీణ్ పాల్గొన్నారు. వీర్నపల్లి మండలంలో బాలింతలకు కేసీఆర్ కిట్లు అందించారు. అనంతరం కేక్ కట్ చేశారు. మాజీ జెడ్పీటీసీ కళావతి, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రుద్రంగి ఆర్యవైశ్య భవన్‌లో కేక్ కట్ చేశారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపారాణి మహేశ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కమలాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లిలో కేసీఆర్ కిట్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కోనరావుపేటలో కేసీఆర్ కిట్లను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉచిత వైద్యశిబిరం



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 75 మందిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుజాత, ఆరోగ్య పర్యవేక్షకుడు గంగమరాజు, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, సరస్వతి, ఆశా కార్యకర్త మాధురి, తదితరులు పాల్గొన్నారు.